REGD. NO. A. 18 విడిప్రతి 0-20 న. పై. శుక్రవారం 1-2-63

# జమీన్‌రైతు

సంస్థాపకులు : నెల్లూరు వెంకట్రామానాయుడు

సంపుటి 35 ] సంపాదకుడు : నెల్లూరు శ్రీరామమూర్తి [ సంచిక 5

## చావన్‌కు గీతాప్రబోధం

రాష్ట్రపతి డాక్టర్ ఎస్. రాధాకృష్ణన్, రక్షణమంత్రి శ్రీ వై. బి. చవాన్‌ను పదునెనిమిది భాగాలుగా రాగి రేకులపై లిఖితమైన భగవద్గీతను బహూకరిస్తూ అనాడు కురుక్షేత్ర రణరంగంలో కృష్ణపరమాత్మ అర్జునునికి కర్తవ్యబోధచేసి, ధైర్యసాహసాలను ప్రసాదించినట్లే, ఈనాడు శ్రీ చవాన్‌కుగూడా లభించుగాక అని ఆకాంక్షిస్తూ భారతజాతి పక్షంగా బహూకరించారు.

## హైదరాబాదు లేఖ

★ రాష్ట్రరాజకీయ రంగంలో రగడ

★ భారీ విద్యుత్పరికరాల ఫ్యాక్టరీకి దింపుడుకళ్లెం ఆశ

★ రక్షణకృషి-జిల్లాలమధ్యపోటీ

ఫిబ్రవరినెల వస్తున్నది అనేసరికి, చలి కాలంపోయి ఎండకాలానికి దారితీసినట్లే, రాష్ట్ర రాజకీయాల చలితీరిపోయి, రంగ మంతాయింతో వేడెక్కడం మామూలై పోయింది.

ఈసారి ఫిబ్రవరినెలలో రాష్ట్రకాంగ్రెసు రగడ ముప్పిరిగా సందుకు త్రోసుకుని వస్తున్నది. కృష్ణాజిల్లాలో ప్రారంభమైంది రగడ. ఆ కృష్ణా జిల్లాకాంగ్రెసుసంఘం సరిగా పనిచేయడంలేదని "కాకాని - మండలి" ముఠా వారి పితూరీలు పురస్కరించుకుని ఆ జిల్లాసంఘాన్ని రద్దుచేయ సంకల్పించి, పి. జి. సి. సి. వారు శ్రీ భార్గవాను విచారణకు పంపుతున్నారు. దీనికి ముందు రామచంద్రయ్యాచేను 21 తేది విచారణకుపంపుతున్నట్లు వర్తమానం పంపినా, ఆయనస్థానే, శ్రీ భార్గవాను పంపుతున్నట్లు వర్తమానంపంపారు. ఆయన బుధవారం సాయంత్రానికి బందరు చేరుకుని, గురు, శుక్రవారాలు విచారణజరిపి, శని వారంనాడు ఢిల్లీకి తిరిగివెళ్లారట. ఆయన ఢిల్లీకివెళ్ళి రిపోర్టు తయారుచేసేసరికి సంజీవయ్యగారూ ఢిల్లీకి చేరుకుంటారు. అంతట

—తరువాత 7 వ పేజీలో



భారతరాజధాని ఢిల్లీలో జనవరి 26 తేది రిపబ్లిక్ దిన మహోత్సవాలను పదిలక్షలమంది ప్రజలు తిలకించారు. ఆ వుత్సవాలలో శోభాయమానంగావున్న ఒక భాగమే ఛాయాచిత్రం.

# శ్రీ డాంగేపై కలకత్తా కామ్రేడుల తిరుగుబాటు!

## మాట్లాడనివ్వకుండా గేలి: పెకింగుభక్తుడుగా నంబూద్రిపాద్‌కు జేజేలు

### కమ్యూనిస్టులలో మాస్కో శిష్యులు, పెకింగ్‌భక్తులు వున్నారుగాని, భారత దేశానికి అనుకూలురు లేరు!

"కమ్యూనిస్టుపార్టీలో రష్యా వర్గం వున్నది, చైనా వర్గం వున్నది; కాని ఇండియావర్గంలేదు" అన్నారు కేరళ ముఖ్యమంత్రి శ్రీ శంకర్. అక్షరలక్షలు చేసేమాటలివి. భారత కమ్యూనిస్టుపార్టీకి సంబంధించి గత 19 తేది కలకత్తా కమ్యూనిస్టులనుండి ఆ పార్టీ అధ్యక్షుడు శ్రీ ఎస్. ఏ. డాంగే పొందిన సత్కారాన్ని చూచినపుడు ఇందులో ప్రతిఅక్షరం యదార్థమని రుజువవుతుంది.

భారత కమ్యూనిస్టు పార్టీలో మాస్కో-పెకింగ్ వర్గాలమధ్య అంతరంగికంగా ఎంతోకాలంనుండిజరుగుతుండినపోరాటం, చైనా దురాక్రమణ సందర్భంలో కొంత వరకు బయటపడి, గత 19 తేది కలకత్తాలో బ్రద్దలైంది. దేశానికేగాక, తమ స్వంతపార్టీ నిర్ణయానికిగూడా ద్రోహం చేసిన పశ్చిమ బెంగాలు కమ్యూనిస్టు నాయకులపైక్రమశిక్షణచర్యతీసుకోనుటలో కార్యవర్గ ఆమోదాన్ని పొందలేక, ద్విసభ్య విచారణ సంఘంగా నియమించబడి కలకత్తాకు పోయిన శ్రీ డాంగే, శ్రీ నంబూద్రిపాదులను పార్టీసమావేశంలో మాట్లాడనివ్వకుండడమేగాక వారి పట్ల అవజ్ఞంగా ప్రవర్తించి, దౌర్జన్యానికిగూడా ప్రయత్నించారు. డాంగే వర్గీయులు బల్లలక్రింద, కుర్చీల క్రిందదాగుకో వలసిన దుస్థితి కల్గిందంటే, ఆ విభేదాలు ఎంత తీవ్రమైనవో, వుద్రిక్తమైనవో మనం వూహించవచ్చు. కలకత్తాలో డాంగేపట్ల వ్యవహరించినంత అవజ్ఞంగా, నంబూద్రిపాదుపట్ల ప్రవర్తించలేదు. వారిని పెకింగ్ భక్తులుగా పరిగణించి జయజయ నాదాలిచ్చి బెంగాల్ నాయకులపై చర్యతీసుకోనుటకు పార్టీ కార్యవర్గందేశ అంగీకరింపజేసుకోలేక పోవడాన్నిబట్టి, కార్యవర్గంలోగూడా శ్రీ డాంగే తనబలాన్ని కోల్పోయాడా అని పిస్తుంది.

> **ఈవారంలో—**
> **మనదేశం**

ఏమైతేనేమి అత్యవసర పరిస్థితుల్లో చైనా అనుకూలురైన కమ్యూనిస్టునాయకులను అరెస్టు చేయడంలో ప్రభుత్వం ఏ మాత్రం తొందరపడలేదని, పొరపాటు చెయలేదని, దానికి వగచవలసిన అవసరం లేదని ఇటీవల ఆ పార్టీ పరిస్థితులు గమనిస్తే దృఢపడుతుంది. కాని కమ్యూనిస్టు పార్టీ మాత్రం అరెస్టుచేసినవారందరిని విడుదల చేయవలసిందిగా ఆందోళన చేస్తున్నది. వివిధ రాష్ట్రాలలో ఇప్పటికే కొందరు విడుదల చేయబడినారు. కొందరి విషయం పరిశీలనలో వున్నట్లున్నది. కమ్యూనిస్టులలో ఎవరు రష్యా అనుకూలురో, ఎవరు పెకింగు భక్తులో తెలియదు. పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న ఘర్షణ దేశభక్తులైన కమ్యూనిస్టులు, దేశద్రోహులైన కమ్యూనిస్టుల మధ్య అధికారం కొరకు జరుగుతున్నదిగాదు. కమ్యూనిస్టుమార్గంలో మాస్కో-పెకింగులలో ఏది అనుసరణీయమను విషయంలోనే వారి పోరాటమంతా! అందువల్ల వీరి విడుదలను తలపెట్టేముందు కేరళ ముఖ్యమంత్రి వెలిబుచ్చినట్లు కమ్యూనిస్టుపార్టీలో భారతీయవర్గం అంటూ ఒకటి లేదనేది రాష్ట్రప్రభుత్వాలు గమనించడం అవసరం.

### రిపబ్లిక్ ఉత్సవ సత్కారాలు

ఈ సంవత్సరంగూడా రిపబ్లిక్ దినోత్సవ సందర్భంలో విద్య, వైద్య, వైజ్ఞానిక, పాలనాది రంగాలలో గణనీయమైన సేవ చేసిన మొత్తం 38 మంది పెద్దలు సముచిత బిరుదులతో సత్కరింపబడినారు.

ఇందులో ఉపరాష్ట్రపతి డాక్టరు జకీర్ హుసేన్, సంస్కృత పండితుడు, 83 సంవత్సరాల వృద్ధుడు డాక్టరు పాండురంగ వామనకానే గారలు 'భారతరత్నా' లతోను; మధ్య ప్రదేశ్ గవర్నరు శ్రీ హెచ్. వి. పటాస్కర్, మద్రాసు విశ్వవిద్యాలయ ఉపాధ్యక్షుడు డాక్టరు లక్ష్మణస్వామి మొదలియారు, పశ్చిమ బెంగాల్ శాసనసభ స్పీకరు డాక్టరు సునీతి కుమార్ చటర్జీగారలు 'పద్మవిభూషణ' లతోను అలంకరింపబడినారు. 'పద్మభూషణ' బిరుదులు ప్రసాదింపబడిన పన్నెండు మందిలో విజయవాడ పార్లమెంటు సభ్యుడు, తెనుగు ఇంజనీరు డాక్టరు కానూరు లక్ష్మణరావు (కె. ఎల్. రావు)గారొకరు. ఇవిగాక 'పద్మశ్రీ' సత్కారాలు 21 మందికి లభించాయి. ఇందులో చిత్ర నిర్మాత శ్రీ మెహబూబ్ ఖాన్, ఆకాశవాణి ద్వారా ఇంగ్లీషు వార్తలను ప్రశంసనీయంగా ప్రసారంచేసే మెల్‌విల్లి డిమెల్లో గారలు కలరు.

భారతరత్న బిరుదులు పొందినవారు

—తరువాత 7 వ పేజీలో

> బాధ్యతారహితమైన
> ప్రసంగం
> శత్రువుకు
> రహస్యాయుధం

రుచికీ! సువాసనకు!
... సాటిలేనిది ...
మీరు నిత్యమూ నమ్మకముగా వాడదగినది.
నేషనల్ కాఫీ పొడి
స్పెషల్ వక్క పొడి
... అన్నిషాపులలో దొరుకును ...
నేషనల్ కాఫీవర్క్సు
స్టోన్‌హౌస్‌పేట. నెల్లూరు 2

